ప్రజాశక్తి
శనివారం 4 ఫిబ్రవరి 2023 | 5
పార్వతీపురం మన్యం



వైస్ ఎంపిపిగా సంపత్ కుమార్

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

జియ్యమ్మవలస వైస్ ఎంపిపిగా గుడివాడ సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఒకటో వైస్ ఎంపిపి ఎన్నికైన కెటివాడ ఎంపిటిసి ముదిలి షణ్ముఖరావు మరణంతో ఖాళీ ఏర్పడింది. దీంతో అధికారులు శుక్రవారం ఒకటో వైస్ ఎంపిపి ఎన్నిక కొరకు ఏర్పాట్లు చేశారు. వైస్ ఎంపిపి ఎన్నిక కోసం పెదమెరంగి ఎంపిటిసి గుడివాడ సంపత్‌కుమార్ ఒక నామినేషన్ దాఖలైందని, దీంతో ఆయన్ను వైస్ ఎంపిపిగా ఎంపిడిఒ ఎస్.రమేష్ ప్రకటించారు. అనుకున్నట్లుగానే స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు సంపత్‌కుమార్‌కు ఒకటో వైస్ ఎంపిపి పదవిని కట్టబెట్టారు. దీంతో ఎన్నిక లాంఛనంగానే జరిగిపోయింది. ప్రమాణ స్వీకారం కార్యక్రమం జడ్పిటిసి ఎం.శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకరరావు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అరకొరగా తాగునీరు

- కొత్త ప్రాజెక్టు పూర్తయ్యేదెప్పుడు?
- నిరంతరం నీరు ఇచ్చేదెన్నడో..?
- ప్రజలకు తప్పనినీటి కష్టాలు



ట్యాంకు నీటిని పట్టుకుంటున్న కొత్తవలస ప్రాంత ప్రజలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ పరిధిలో 30 వార్డుల్లో పెరుగుతున్న జనాభాకు సరిపడా తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదనే చెప్పవచ్చు. 1962లో మున్సిపాల్టీలో తాగునీటి వ్యవస్థ మొదలైనప్పటి నుంచి 2010లో ఉన్న పాలకవర్గం, అనంతరం నాలుగేళ్ల స్పెషల్ ఆఫీసర్ పాలన వరకు తాగునీరు సరఫరా ప్రతిరోజూ జరిగేది. అయితే తోటపల్లి నూతన రిజర్వాయర్ నిర్మాణం జరిగినప్పటి నుంచి 3,4 రోజులకు ఒకసారి మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం వర్షాకాలంలో రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో రిజర్వాయర్ ఉన్న 4 ఇన్ ఫిల్ట్రేషన్ బావుల్లో ఇసుక మేటలు ఎక్కువగా చేరుతున్నాయి. దీంతో బావుల్లోని మోటార్లు తరచూ మరమ్మతులకు గురవ్వడం ఒక సమస్య అయితే, తోటపల్లి రిజర్వాయర్ దగ్గరలో ఉన్న పంప్ హౌస్‌కు విద్యుత్ సరఫరా లోపం ప్రధాన కారణం. వర్షాకాలం అనంతరం రిజర్వాయర్ గేట్లను ఇరిగేషన్ అధికారులు మూసి వేయడంతో ఇన్‌ఫిల్టరేషన్ బావుల వైపు నీరు ప్రవహించకపోవడంతో మున్సిపల్ అధికారులు నీటి ప్రవాహ దిశను మళ్లించేందుకు ప్రతి ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ పట్టణ ప్రజలకు తాగునీరు అందివ్వడంలో మున్సిపల్ అధికారులు వెనుకంజలోనే ఉన్నారు. ఇటీవల రూ.63.63 కోట్లు ఎఐఐబి సహ కారంతో సమగ్ర తాగు నీటి సరసన ప్రాజెక్టు కోసం పట్టణంలో ఒక వార్డులో మాత్రమే పైప్ లైను తవ్వకాలు జరిగి పైపులను అమర్చి పనులను నిలిపివేశారు. రెండేళ్లు అయితే గానీ ఈ ప్రాజెక్టు పనులు పూర్తవ్వవని అధికారుల అంచనా. అప్పటి వరకు పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవు.



నీటి ప్రవాహాన్ని మళ్లిందుకు సిద్ధం చేసిన ఇసుక బస్తాలు

తాగునీటి నిల్వ సామర్థ్యం

- 4 పెద్ద రిజర్వాయర్లు, ఒక చిన్న రిజర్వాయర్
- జగన్నాథపురంలో 600 కిలోలీటర్లు సామర్థ్యం
- మున్సిపల్ కార్యాలయం వెనుక 500 కిలో లీటర్ల సామర్థ్యం
- కొత్తవలసలో 500 కిలో మీటర్ల సామర్థ్యం
- 500 కిలోలీటర్ల సామర్థ్యం ఒక రిజర్వాయర్
- 220 లీటర్ల సామర్థ్యం గల చిన్న రిజర్వాయర్

వేసవిలో తాగునీటి సరఫరాకు చర్యలు

రానున్న వేసవిలో పట్టణంలో ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతాం. వర్షాకాలంలో వచ్చే వరద నీటి ప్రవాహం వల్ల ఇన్ ఫిల్టర్ బావుల్లో ఏర్పడే ఇసుకమేట్లను ఇప్పటికే 2ఇన్ ఫిల్టర్ బావుల్లో ఇసుకమేటలను తొలగించాం. మిగిలిన రెండు బావుల్లో ఇసుక మేట్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇన్ ఫిల్టర్ బావుల వైపు నీటి ప్రవాహాన్ని మళ్లించేందుకు పనులు చేపట్టాం. ఇప్పుడున్న మోటర్లు మరమ్మతులకు గురైతే ముందస్తు చర్యల్లో భాగంగా అదనపు మోటార్లను సిద్ధం చేసి ఉంచాం. తాగునీటి పైపులైను లేని ఎస్ఎన్‌పి కాలనీ, గూడ్స్‌షెడ్ రోడ్, కొత్తవలస శివారు కాలనీ ప్రాంతాల ప్రజలకు మున్సిపల్ నీటి ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తున్నాం.

జె. రామ అప్పలనాయుడు,
కమిషనర్

సమస్య పరిష్కారానికి చర్యలు చూపండి

ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల్లో ప్రధానమైంది తాగునీరు. ఏడేళ్ల క్రితం పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా ప్రతిరోజూ తాగునీరు సరఫరా జరిగేది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు రోజులు, మూడురోజులకొకసారి తాగునీరు సరఫరా జరుగుతుండడం విచారకరం. ఇప్పటికైనా పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు, అధికారులు తాగునీటి సరఫరాపై దృష్టి సారించి సమన్వయంతో సమస్య పరిష్కరించాలి.

పాకల సన్యాసిరావు,
పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి



పూసపాటిరేగలో అభివాదం చేస్తున్న పత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రత్యేక హోదా సమరయాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, పూసపాటిరేగ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై హిందూపూర్ నుంచి ఇచ్ఛాపురం వరకు విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర చేపట్టిన నాయకులకు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బాలాజీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మంది విద్యార్థులు, యువజనులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, విశాఖ ఉక్కును అమ్మేసినా, కేంద్ర గిరిజన విద్యాలయానికి నిధులు కేటాయించక పోయినా సరే ఇక్కడున్న వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పట్టించుకోడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పరిశ్రమలు, రైల్వేజోన్, నీటి ప్రాజెక్టులు పెట్టి ప్రజలను ఆదుకుంటామన్నారని, ఆ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. హోదా సాధనకు విద్యార్థులు, యువజనులు చేపట్టే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

చలో పార్లమెంట్‌కు తరలిరండి

ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధనకై చలో పార్లమెంటు ముట్టడికి విద్యార్థులంతా తరలిరావాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పూసపాటిరేగ చేరుకున్న సమరయాత్ర నాయకులకు విద్యార్థులు స్వాగతంపలికారు. అనంతరం ఎస్‌విఎస్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి,యువజన సంఘాలు చేస్తున్న సమరయాత్రతో రాజకీయ నాయకులు కళ్లు తెరవాలని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, ఎస్ ఎఫ్ ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని, డి వైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.లెనిన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేష్, ఎఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సునీల్, నాగభూషణం, ,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని కలింగవైశ్య భవనంలో శుక్రవారం వైసిపి జిల్లా మండల అధ్యక్షులు పి.మురళి అధ్యక్షతన గృహసారధుడు, కన్వీనర్లకు, వాలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ అవగాహనతో పాటు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు తమ ప్రభుత్వం జవాబుదారీగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి గృహ సారథులు కన్వీనర్లు గా ఉంటారని, ఈ ముగ్గురు ద్వారా కృషి జరుగుతుందన్నారు. 234 సర్వీసులు, 110 పథకాల ద్వారా ప్రజలకు సేవలందించామని, ప్రతి ఇంటికి ఏదో ఒక లబ్ది చేకూరిందని అన్నారు. కావున నిర్భయంగా ప్రతి ఇంటికి వెళ్లి మాట్లాడవచ్చున్నారు. ఈనెల 11న ప్రజా మద్దతు పుస్తక ప్రశ్నలు, ఇతర కార్యక్రమం ప్రారంభం ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ఎస్.హైమావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలు 100శాతం ప్రజలకు చేరవులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తాము పొందిన ప్రభుత్వ సంక్షేమల పథకాలనే తమ దృష్టిలో ఉంచుకొని జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవి కుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వి.సాయిరాం, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, ఎంపిడిఒ త్రినాధరావు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోజూ ఇదే పనేటమ్మా..

వృద్ధురాలిపై ఎమ్మెల్యే చిర్రుబుర్రులు

ఆ వృద్ధురాలికి 80 సంవత్సరాలు పైబడే ఉంటాయి... మా మండలం ఎమ్మెల్యే.. మా ఊరు మనవడు తాను ఏది అడిగినా కాదు అనడు అన్న నమ్మకంతో ఆ వృద్ధురాలు ఎంతో ప్రయాసతో నడవలేని స్థితిలో వేరే మహిళా సహకారంతో వాలంటీర్లు, గృహసారధులకు జరిగిన సమావేశం వద్దకు వచ్చింది... బాబూ నా పింఛను ఆగిపోయింది... నాకు అదే జీవనం... పింఛను ఇచ్చి పుణ్యం కట్టుకోబాబు అంటూ ఆ వృద్ధురాలు ఎమ్మెల్యేను వేడుకుంది. దీంతో ఎమ్మెల్యే చీదరించుకుంటూ 'నువ్వెందుకు వచ్చావ్...రోజూ ఇదే పనేటమ్మా అంటూ చిర్రుబుర్రులాడడంతో వృద్ధురాలు నిరాశతో వెనుతిరిగిన ఉదంతం చోటు చేసుకుంది.

మండలంలోని పలగరలో మీసాల వీధికి చెందిన బెహరా అన్నపూర్ణమ్మ (80) పింఛను ఆరు నెలల నుంచి ఆగిపోయింది. పూర్తిస్థాయిలో తన జీవనం కష్టతరమైందని చెప్పుకోవడానికి ఆ వృద్ధురాల ఎమ్మెల్యే వద్దకు వచ్చింది. తీరా ఆయన ఆమెపై చిర్రుబుర్రులలాడడంతో వెనుదిరిగింది. ఈ సంఘటనను విన్న కొంతమంది మహిళలు ఎమ్మెల్యే మాటతీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం ఆమె వయసుకైనా గౌరవం ఇవ్వకుండా ఇలా మాట్లాడడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఇటీవల పలగరలో నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలందని అర్హులెవరైనా ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వారికి పథకాలు వర్తించేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అలాగే తమ ప్రభుత్వం కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని మాటలే తప్ప చేతలు కాదని చర్చించుకుంటున్నారు.



నిరాశతో వెనుదిగిరి వెళ్లిపోతున్న వృద్ధురాలు అన్నపూర్ణమ్మ

జిల్లాతో విశ్వనాథ్‌కు ఎనలేని అనుబంధం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రముఖ దర్శకుడు కళాతపస్వీ కె.విశ్వనాధ్‌కు ఉమ్మడి విజయనగరం జిల్లాతో ఎనలేని అనుబంధం ఉంది. ఈనేపథ్యంలో ఆయన కన్నుమూశారని తెలుసుకున్న జిల్లావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విశ్వనాథ్ జిల్లాకు వచ్చినప్పటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకొని నివాళులర్పించారు. సంగీతం, సాహిత్యంతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాన్ని మేళవించి తెలుగు సినిమాకు పునర్జీవం పోశారని కొనియాడారు.

శుభ సంకల్పం సినిమా విజయనగర పరిసర ప్రాంతాల్లో 1994లో చిత్రీకరణ చేసినపుడు డి.వై.సంపత్ కుమార్ శిక్షణలో ఆంధ్ర జాలరి నృత్యాన్ని కమల్ హాసన్‌తో చిత్రీకరించారు. ఆ సమయంలో సంపత్ కుమార్ హస్తబల్ హాల్ లో నిర్వహించిన సత్కార సభలో పాల్గొన్నారు. 2003లో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ విశిష్ట పురస్కారాన్ని కళా తపస్వి విశ్వనాథ్ విజయనగరంలోని గురజాడ కళాభారతిలో అందుకున్నారు. ఆ సందర్భంగా ముఖ్యవక్తగా ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం కూడా విచ్చేశారు.ఆయనతో ఆత్మీయ అనుబంధం ఏర్పడిన కాపుగంటి ప్రకాష్ ఇద్దరు కుమార్తెల వివాహాలకు ప్రత్యేకంగా విశ్వనాథ్ విచ్చేశారు. ఆత్రేయ స్మారక కళాపీఠం అధ్యక్షులు ఉసిరికల చంద్ర శేఖర్ షష్టిపూర్తి కార్యక్రమానికి వేటూరి గారితో కలసి విచ్చేసారు. 2006లో విజయనగరం కొత్తగ్రహారం శివ్వా నానాజీ ఇంట్లో ఉండి బాబామెట్ట లో సంప్రదాయ వైద్యులు రజనీ కాంత్‌తో విశ్వనాథ్ మోకాళ్ళ నొప్పులకు15 రోజుల పాటు చికిత్స పొందారు. ఆ సమయంలో ఆనంద గజపతి కళాక్షేత్రంలో విజయనగరానికి చెందిన యువ గాయనీ గాయకులతో ఏర్పాటు చేసిన సంగీత విభావరిలో పాల్గొన్నారు. తన జీవితంలో అది మరచిపోలేని రోజు అని ఆయన అన్నారు. 2010 సంవత్సరంలో శుభప్రదం సినిమా చిత్ర బృందం తో విజయనగరం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్దికాలం క్రితం సన్ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిధిగా వచ్చిన సందర్భం లో రామనారాయణ ప్రాంగణాన్ని దర్శించారు.

కళా తపస్వి సినిమాలు విలువల వేదాలు

విశ్వనాథ్ మృతి తెలుగు సినీ రంగానికి, తెలుగు ప్రేక్షకులకు తీరనిలోటు అని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. 2017లో విశ్వనాథ్ సినీ జీవిత విశేషాలపై నేను రాసిన కళాతపస్వి అనే పుస్తకాన్ని హైదరాబాద్‌కు చెందిన కిన్నెర పబ్లికేషన్స్ ప్రచురించింది. ఆఏడాది ఫిబ్రవరి 19న విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన స్వగృహంలో ఆవిష్కరించారని తెలిపారు. విజయనగరంలోని తోటపాలేనికి చెందిన ప్రముఖ చిత్ర కళాకారిణి సిరిపురపు ప్రవల్లిక 2009లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విశ్వనాథ్ చేతుల మీదుగా సంకల్ప్ బాల మేధావి పురస్కారాన్ని అందుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను ఆమె గుర్తు చేస్తూ విశ్వనాథ్ చేతుల మీదుగా పురస్కారం పొందడం తన పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌కు చిత్ర నీరాజనాన్ని అందించారు.



గీతా నృత్య కళాశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కె.విశ్వనాథ్ (ఫైల్)



హాస్టల్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావు

గర్భిణులకు పౌష్టికాహారం : పిఒ

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో గల గర్భిణుల హాస్టల్‌ను తనిఖీ చేశారు. గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, రక్తహీనతతో బాధపడే వారికి హాస్టల్‌లో అవసరమైన మందులు, పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పౌష్టికాహార లోపంతో బిడ్డ జన్మిస్తే ఆ ప్రభావం బిడ్డపై జీవితాంతం ఉంటుందని, కావున ఆరోగ్యవంతమైన బిడ్డ కోసం ప్రతి గర్భిణి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం, పారిశుధ్యం తనిఖీలు నిర్వహించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో పారిశుధ్యం మెరుగుపర్చాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం హార్టికల్చర్, నర్సరీ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. ట్రైనింగు సెంటరు అభివృద్ధిపై అధికారులకు సూచనలు చేశారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయిలోని హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు.




సిఎం వర్చువల్ కార్యాక్రమంలో పాల్గొన్న కలెక్టర్, వివిధ కాలేజీల విద్యార్థులు

త్వరితగతిన డైనింగ్ హాళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నడుస్తున్న పోస్ట్ మెట్రిక్ బాలురు, బాలికల హాస్టల్లో కిచెన్ కమ్ డైనింగ్ హాళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని బంగారమ్మ కాలనీ, బంగారమ్మ పేటల్లో గల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో రూ.50లక్షలు చొప్పున వ్యయంతో కిచెన్ కమ్ డైనింగ్ హాళ్ల నిర్మాణం జరుగుతోంది. చాలా కాలంగా జరిగిన ఈ నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇటీవల గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర ఈ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న కిచెన్ కమ్ డైనింగ్ హాళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కిచెన్ కమ్ డైనింగ్ హాళ్ల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు కోరడంతో రాజన్నదొర ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ చీఫ్ శ్రీనివాసరావు పనులను పరిశీలించిన తర్వాత అధికారులతో మాట్లాడారు. పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ డిఇ మణిరాజ్,ఎఇ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



గర్భిణుల వసతిగృహంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ

పేద విద్యార్థుల విదేశీ విద్యకు సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్

విదేశీ ఉన్నత విద్యను అభ్యసించాలనే అర్హులైన పేద విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి జిల్లాకలెక్టరు, వివిధ కళాశాలల విద్యార్థులు కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంనుండి వర్చువల్ గా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ విదేశీ విద్యను అభ్యసించాలనుకొనే పేదవిద్యార్థులకుఉన్నత విద్యను అందించేందుకు, పేద విద్యార్థుల ప్రతిభను, తెలివితేటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. విదేశీ యూనివర్శిటీల్లో ప్రవేశాలు పొంది, కుటుంబ వార్షిక ఆదాయం పరిమితి రూ.8లక్షల్లోపు గల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఒబిసి విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్, బిసి వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా రుణాలు చెల్లించే వారికి రాయితీ

వీరఘట్టం : వ్యవసాయ పరపతి సేవా సంఘం ద్వారా రుణాలు తీసుకున్న రుణగ్రస్తులు ఈ నెలాఖరుకు నాలుగు శాతం రాయితీ చెల్లించాలని పిఎసిఎస్ సిఇఒ బి.పైడ్రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెలాఖరుకు నాలుగు శాతం రాయితీ చెల్లించకపోతే మార్చి ఒకటి నుంచి 14 శాతంతో రాయితీ చెల్లించాల్సి వస్తుందన్నారు. రుణగ్రస్తులు ఈ అంశాన్ని గ్రహించి సకాలంలో రాయితీ చెల్లించాలని ఆయన కోరారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

జగనన్న అర్బన్ లేఅవుట్లో నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయితీ కార్యాలయం ప్రాంగణంలో లబ్ధిదారులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లింపు జరుగుతున్నాయని, గృహ నిర్మాణ మేస్త్రీలతో కలిసి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు శతశాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమం గూడు లేని ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిని చేకూరుస్తుందన్నారు. జగనన్న కలలను సాకారం చేసేందుకు గానూ లబ్ధిదారులంతా గృహాలను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గృహ నిర్మాణాలకు గానూ యంత్రాంగమంతా అన్ని వసతులు కల్పిస్తున్నందున లబ్ధిదారులంతా వారి గృహ నిర్మాణాలు ఉత్సాహంగా పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు అందుబాటులో సిమెంట్, స్టీల్, ఇసుక మొదలగు మెటీరియల్ లబ్ధిదారులకు అందించాలని కమిషనర్ సూచించారు. గృహ నిర్మాణదారులకు ఇబ్బందిలేకుండా ఇప్పటికే చేపడుతున్న సంపుల ద్వారా నీటిని అందించే ప్రక్రియ ద్వారా గృహ నిర్మాణ దారులందరికీ నీరు అందేలా చూస్తున్నామన్నారు. అతి త్వరలో కరెంట్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్, అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టం, పార్కులు మొదలగునవి కల్పిస్తామ అన్నారు. సిబ్బంది అంతా పూర్తి నిబద్ధతతో పనిచేసి గృహ నిర్మాణదారులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మాధవరావు ఉన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న పరీక్షిత్‌రాజు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

కురుపాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్ అన్నారు. శుక్రవారం కురుపాంలోని సాయిరాం గుడి మైదానం వద్ద కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత క్రీడలపై ఆసక్తి కలిగి ఉండడం వల్ల యువత భవిష్యత్తుకు ఆరోగ్యపరంగా ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంతేకాకుండా మానసిక ఉల్లాసం, శారీరదారుఢ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. కావున యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు యువత పాల్గొన్నారు.



దంతపరీక్షలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ నవ్య

ఐటిఐలో దంత వైద్య శిబిరం

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో విద్యార్థులకు ఉచిత దంత మెగా వైద్య పరీక్షలు నిర్వహించారు. తగరపువలస చెందిన అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వైద్య బృందం సుమారు 250 మందికి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ఐటిడిఎ పిఒ డాక్టర్ బి.నవ్య పరిశీలించారు. ట్రైనీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇటువంటి మెడికల్ క్యాంపులు నిర్వహించిన ప్రిన్సిపల్ టివి గిరిని, సిబ్బందిని అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఐటిఐ ఉత్తీర్ణత అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ, ఇతర సంస్థల్లో అప్రెంటీస్, ఉద్యోగంలో చేరే ముందు విద్యార్థులకు ఫిజికల్ టెస్టులు తప్పని సరి అని, దీన్ని దృష్టిలో పెట్టుకొని గతనెల నేత్ర పరీక్షలు, ఇప్పుడు దంత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గర్భిణులకు పోషణ్ ప్లస్ కిట్లను అందజేస్తున్న సిడిపిఒ అనంతలక్ష్మి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పాచిపెంట: గర్భిణులు పౌష్టికాహారం తీసుకొంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సుఖప్రసవం అయ్యే అవకాశాలు ఉన్నాయని సిడిపిఒ బి.అనంతలక్ష్మి అన్నారు. సాలూరులోని వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 15మంది గర్భిణులను కలిసి ఇక్కడ వారికి అందుతున్న వసతి, పోషకాహారం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లను అందజేశారు. అనంతరం గర్భిణులకు ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలను వివరించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రెడ్డి ఇందిర ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

లక్ష్య సాధనకు యువత శ్రమించాలి : సిఐ

సాలూరు : లక్ష్య సాధన కోసం ప్రణాళికాబద్ధంగా యువతీ యువకులు శ్రమించాలని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కోరారు. కళాశాలలో ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని కోరారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఎంఒ ఆదేశాల అమలుకు చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలను విడుదల చేయడం చాలా హర్షణీయమని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీ పోస్టులను ఇన్చార్జిలతోను, ఎఫ్ఎసి విధానంలో నడిపించడం వల్ల సక్రమంగా పనులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. తక్షణమే ఇన్చార్జ్, ఎఫ్ఎసిలతో నడుస్తున్న పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని, ఒకవేళ, కోర్టు కేసులు ఉన్నప్పటికీ వాటి తుది తీర్పుకు లోబడి అడహాక్ పద్ధతిలో ప్రమోషన్స్ కల్పించాలని కోరారు.

ఆలయాల నిర్మాణానికి స్థల పరిశీలన

సీతంపేట : మండలంలోని పాత పనుకువలస, కొత్త పనుకువలస, సీతంపేట, గడిగుడ్డి, పెద్దూరు, వలగెడ్డ, మర్రిగూడ, పెదరామన్నగూడ, మొగధర తదితర గ్రామాల్లో ఆలయాల నిర్మాణాని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో టిటిడి ఆధ్వర్యాన ఆలయ నిర్మాణాలకు రూ.10లక్షలు చొప్పున ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. వీటిలో రూ.8 లక్షలు ఆలయ నిర్మాణానికి, రూ.2లక్షలు విగ్రహాల కోసం టిటిడి కేటాయించిందని తెలిపారు. మండలంలో ఇప్పటికే 90పైగా దేవాలయాలు మంజూరయ్యాయన్నారు. స్థల పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రమణ, స్థానిక సర్పంచ్ ఆదిలక్ష్మి, అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని చినబోగిలిలో పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కెకె వర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కాలువల్లో పూడికతీతలు, మురుగునీరు తొలగించాలన్నారు. చేయాలన్నారు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయంలో వచ్చిన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.మనోహర్, సర్పంచ్ కురమాన రాధా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని దయానిధిపురంలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఆరోగ్య పరీక్షలు, తనిఖీలు పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, సీజనల్‌గా వచ్చే వ్యాధులున్న వారికి, అలాగే క్షేత్ర స్థాయిలో కదల్లేని స్థితిలో ఉన్న వారిని, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారికి ఆరోగ్య పర్యవేక్షణ, అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, స్కూల్ పిల్లలకు ఆరోగ్య తనిఖీలు మొదలగు వైద్య సేవలందిస్తూ పలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్టు జగన్మోహన్ స్థానికులకు వివరించారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో కలిసి గృహ సందర్శనలు చేసి పలువురి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. వారికి వైద్య సిబ్బంది అవసరమైన తనిఖీలు చేసి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా నిర్వహిస్తున్న అన్ని ఆరోగ్య పరీక్షల నివేదికలను వెంటనే ఆన్లైన్‌లోను, రికార్డుల్లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేటలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచానికే పరిమితమైన వారికి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారుల ఆరోగ్యం తెలుసుకొని వారికి వైద్యం అందజేయడం జరుగతుందని, అలాగే గర్భిణులు, బాలింతలు, వయోవృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అందరికీ ఆ గ్రామంలో వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడే మందులు ఇచ్చి తగు జాగ్రతలు తీసుకోవాలని సూచిస్తున్నట్లులు తెలిపారు. కావున ప్రజలు ఈ వైద్య సేవలు వినియెగించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, శ్రీధర్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం : రోగులను పరీక్షిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వందువలో...

వీరఘట్టం : మండలంలోని వండువలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్.తనూజ, నితీష్ రక్తపోటు, మధుమేహం, జ్వర పీడితులతో పాటు గర్భిణీలు, బాలింతలు తదితరులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బివిఎ లక్ష్మి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

పార్వతీపురంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లతో కలిసి సంక్షేమ పథకాలు పర్యవేక్షించడానికి నియమించిన గృహసారథులు, కన్వీనర్లకు ఈనెల 4న మండలంలోని నర్సిపురం 1, 2, బాలగుడబ, అడ్డాపుశీల, గోపాలపురం, కృష్ణపల్లి, వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి, మరికి సచివాలయాల పరిధిలో గల వారందరికీ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం మండలంలోని వెంకంపేటలో జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత బాధ్యులు ఆరోజు తప్పక శిక్షణకు హాజరు కావాలని కోరారు.

గ్రామ వాలంటీర్లకు అభినందన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురానికి చెందిన గ్రామ వాలంటీర్లు స్వాతి, సీతకు శుక్రవారం స్థానిక సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, సచివాలయ కార్యదర్శి కె.సునీల్‌కుమార్, గ్రామస్తులు అభినందించారు. ఇదే గ్రామానికి చెందిన నారాయణపురం విజయ్‌కుమార్ రాగం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉంగటి సింహాచలం శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వాలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేశారు. సొంత ఖర్చులు పెట్టుకొని ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛను అందజేయడంతో వారిని అభినందించారు.

ఆ ఇద్దరితోనే మాపొత్తు

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

రానున్న ఎన్నికల్లో జనసేనతోనూ, ప్రజలతోనే పొత్తు ఉంటుందని, మరే పార్టీతో పొత్తు ఉండదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. గురువారం స్థానిక సిఎల్ నాయుడు కళ్యాణ మండపం ప్రాంగణంలో జిల్లా విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్య ,వైద్యం, వ్యవసాయం ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకొని ప్రతి సామాన్యుడికి చేరువయ్యేలా వేలాది కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నవరత్నాలతో 9 పథకాలను మాత్రమే అందిస్తుందని, కేంద్రం ఒక రైతులకు మాత్రమే 10 పథకాలు అందజేస్తుందన్నారు. సామాన్యునికి అవసరమైన ప్రతి అంశంపైనా దృష్టి సారిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాల నిధులకు సొంత పేర్లు పెట్టుకుం టుందన్నారు. ఏ పథకం చూసుకున్నా కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుందని తెలిపారు. బిజెపి కార్యకర్తలంతా ఈ విషయాన్ని గ్రహించాలని ప్రజల్లోకి వెళ్లి నిజాలు చెప్పాలన్నారు. కేంద్ర పథకాలు నేరుగా ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని చెప్పారు. ఏనుగుల సంచారంతో ఈ ప్రాంతంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అలాగే కొంతమంది దాడికి గురవుతున్నారని విలేకరులు ప్రశ్నించగా దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.తిరుపతిరావు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి హిమరక ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు అన్నారు మండలంలోని ఆర్.వెంకంపేట, భగ్గందొరవలస, గెడ్డలుప్పి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లాలో ఉన్న ధాన్యాన్ని నేటికీ తీసుకోకపోవడం ప్రభుత్వ దుర్మార్గ చర్య అని విమర్శించారు. మంత్రులు, అధికారులు రైతుల వద్ద ఒక్క ధాన్యం లేకుండా కొనుగోలు చేస్తామని చెప్పి హామీలే తప్ప ఎక్కడా అమలు కావడంలేదని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో 15వేలు చొప్పున ధాన్యం బస్తాలు ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం తీసుకుంటామని చెప్పి ఇ-క్రాప్ చేసిన ధాన్యం కూడా ఇంకా కళాల్లోనే ఉన్నాయని అన్నారు. తక్షణమే స్పందించి ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణునాయుడు, జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, బి.చంద్రమౌళి, మండల నాయకులు ఎస్.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.సత్యనారాయణ, జొన్నాడ గరికయ్య, గ్రామ మాజీ సర్పంచ్ పెంట ఉమామహేశ్వరరావు, రైతులు ఆర్.ఉమా నారాయణస్వామి, తదితరులు, రైతులు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ల ద్వారా సాంకేతిక కోర్సులు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మార్‌నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌ద్వారా శిక్షణ పొంది శిక్షణా కాలం ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్‌హబ్‌లో పొందిన శిక్షణను ఉపయోగించుకుని, ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు హజరై ఉపాధి పొందాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శిక్షణార్థులకు సర్టిఫికెట్లు, ప్రసంశా పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ప్రతినిధి ఉరిటి సాయికుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హరిబాబు, స్థానిక సర్పంచ్, ఉపర్పంచ్, ఎంపిటిసిల వంగపండు లక్ష్మిత్రినాథ, బడేరామారావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఐటిడిఎ నిధులు కలెక్టరేట్‌కు ఎంత ఇచ్చారు?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఐటిడిఎకు చెందిన నిధులు కలెక్టర్ కార్యాలయానికి ఎంత ఇచ్చారని జనసేన నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం ఐటిడిఎ కార్యాలయంలోని పౌర సమాచార అధికారి, సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.సురేష్‌కు ఆర్‌టిఐ సమాచారం కోసం వినతిని అందజేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఐటిడిఎకు చెందిన నిధులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి మళ్లించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గిరిజనుల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఏ విధంగా మళ్లిస్తారని ప్రశ్నించారు. దానికి సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగామన్నారు. వినతిని అందజేసిన వారిలో పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్, సిరిపురం గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి పేరంటాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో శుక్రవారం రెండో రోజు మహాలక్ష్మి పేరంటాల 46వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుజ్జల రాము కుమారుడు గుజ్జల నారాయణరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ముగ్గుల, క్విజ్ పోటీలతో పాటు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొట్నూరు లక్ష్మణరావు, పరిశినాయుడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా పంటలు పండించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల రెండో రోజుల శిక్షణ కార్యక్రమం జట్టు అతిధి దేవోభవ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి.పారినాయుడు హాజరై మాట్లాడారు. పై రెండు మండలాల్లో రైతులు ఏడాది పొడవునా పంటలు పండించుకొనేలా వ్యవసాయ కార్యకర్తల సలహాలు, సూచనలు అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. రైతుల ఆర్థిక అభివృద్ధితో పాటు కుటుంబ ఆహార భద్రత పొందుతారని అన్నారు. భూమిపై ఎల్లప్పుడూ పంటలు పండించడం వల్ల భూతాపం తగ్గుతుందన్నారు. మరోవైపు సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని, పర్యావరణ కాలుష్యాన్ని నిర్మూలించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ఉప ప్రబంధకులు ధనుంజయ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

రసాయన ఎరువులు కంటే జీవామృతం మేలు

పాచిపెంట : రసాయన ఎరువులైన యూరియా, డిఎపి, పొటాష్ పంటల ఎదుగుదలకు, దిగుబడికి ఉపయోగపడతాయి కానీ భూమి భౌతిక స్వరూపాన్ని మార్చలేవని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని గరేళ్లవలసకు చెందిన మర్రి జోజి వరి పొలంలో వినియోగిస్తున్న ప్రకృతి ఎరువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విచక్షణ రహితంగా ఎరువులు వాడితే అటు పంటలను, ఇటు భూమిని పాడుచేసి రైతులకు అపార నష్టాన్ని మిగులుస్తాయని అన్నారు. కావున రైతులు కేవలం రసాయన ఎరువుల మీదే కాకుండా ప్రకృతి ఎరువులను సమపాళ్లలో వినియోగిస్తే భూమి స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. వానపాములు వృద్ధి చెంది కోట్లాది ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరిగి నేలను సారవంతం చేస్తాయని అన్నారు. జీవామృతం అతి సులువుగా తయారు చేయబడే ప్రకృతి ఎరువని, అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని 200 లీటర్ల చొప్పున 3,4 సార్లు అన్ని పంటల్లో ద్రవ జీవామృతాన్ని వినియోగిస్తే ఇక ఎలాంటి రసాయని ఎరువులు వినియోగించాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ లక్ష్మణరావు, సిఆర్‌పి తిరుపతినాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ డిపిఎం ధనుంజయనాయుడు

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సాలూరు రూరల్ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో పిడి సుగుణ వినతిని అందజేశారు. కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, పేస్‌యాప్ రద్దు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూఛార్జీలు పెంచాలని, జీవో 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను, టిఎ, డిఎలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయే కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నారాయణమ్మ, కుమారి, పార్వతి, అరుణ, జానకి, శ్రీదేవి పాల్గొన్నారు.



సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కొమరాడ ఎస్సై జగదీష నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటిపాం రైస్ మిల్లు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నట్లు తెలిపారు. మండలంలో ఉపాధి హామీ జెఇగా పనిచేస్తున్న బి.సోమేశ్వరరావు పార్వతీపురం నుంచి కొమరాడ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జెఇకి స్వల్ప గాయాలు కాగా, వేరే బైకుపై వచ్చిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయన్ను పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. రైల్వే కాంటాక్ట్ వద్ద పనిచేస్తున్న వ్యక్తికి ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో కొంతమేరకు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ మేరకు సంఘనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంగభద్రలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని డంగభద్రలో శుక్రవారం జేమ్స్ రాగోలు వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ జోగి భుజంగరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజీ జనరల్ సర్జన్ వైద్యులు వైద్య శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించారు. గ్రామానికి చెందిన 280 మందికి పరీక్షలు జరిపి వైద్య సహాయాన్ని అందించారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారిని గుర్తించి అవసరమైన వారిని ఆస్పత్రికి రావాల్సిందిగా వైద్యులు సూచించారు. మెగా వైద్య శిబిరంలో గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జస్వంతీ, జనరల్ విభాగం వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, చైతన్య, ఆప్తమాలజీ విభాగం నుంచి డాక్టర్ ప్రసాద్, ఏరియా మేనేజర్ కడగల రమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరరావు, పిఆర్ఒ త్రినాధరావు, స్థానిక సర్పంచ్ జోగి భుజంగరావు, వైస్ సర్పంచ్ శకుంతల పాల్గొన్నారు.

ఇదేం కర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రజలు సిఎంగా చంద్రబాబు నాయుడును చూడాలని కోరుకుంటున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌తో కలిసి పట్టణంలోని 4వార్డులో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు భరించలేని రీతిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. సంక్షేమ పథకాలు కూడా వైసిపి నాయకులు, కార్యకర్తలకే అందుతున్నాయని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని జనం ఎదురుచూస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెపుతారని సంధ్యారాణి చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమారావు, పట్టణ నాయకులు కొనిసి చిన్ని, ఎ.అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

జియమ్మ వలస : మండలంలోని పెద్దబుడ్డిడిలో ఇదేమి కర్మ రాష్ట్రానికి టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడకుండా రాష్ట్రప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పేదలు కొనుక్కోలేని పరిస్థితులు ఏర్పరిచారని, ఆకాశాన్నింటిని ధరలతో ప్రజానీకం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఈ కర్మ నుండి బయట పడాలంటే భవిష్యత్తులో టిడిపిని ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి, అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి దొంకాడ రామకష్ణ, మండల కన్వీనర్ పల్ల రాంబాబు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురానా శ్రీరామ్మూర్తి, జోగి బుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస : పెద్దబుడ్డిడిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు

బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ

ప్రజాశక్తి - భామిని

సకాలంలో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు శుక్రవారం రాత్రి 7గంటల వరకూ నిరీక్షించారు. భామినిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులకు టెన్త్ పరీక్షల నేపథ్యంలో స్పెషల్ క్లాస్‌లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం వేసిన స్పెషల్ బస్సు తప్పిపోయింది. ఈ తర్వాత 5గంటలకు బస్టాప్‌కు చేరుకున్న విద్యార్థులు రాత్రి 7గంటల వరకు ఒక్క బస్సు రాలేదు. 7గంటల తర్వాత ఒకేసారి మూడు బస్సులు రావడంతో విద్యార్థులు బస్సుల కోసం ఒకేసారి పరుగులు తీశారు. ఈ సమయంలో అనేక మంది కిందపడిపోయారు. అరగంటకొకసారి రావాల్సిన బస్సు ఒకేసారి మూడు రావడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.